ప్రజాశక్తి
మంగళవారం 8 ఏప్రిల్ 2025
5
అనంతపురం

నేడు వైఎస్.జగన్ రాక

◆హెలిప్యాడ్ స్థలం మార్పు
◆పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబానికి పరామర్శ
◆అనుమతిలేని వారు రావొద్దంటూ పోలీసుల హెచ్చరిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లాకు మంగళవారం నాడు రానున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తరువాత తొలిసారిగా జిల్లా పర్యటనకు జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. సత్యసాయి జిల్లాలోని రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో కురబ లింగమయ్య హత్యకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే నిందితులు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ హత్య ఘటన జరిగిన వెంటనే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని ఫోనులో పరామర్శించారు. అదే సమయంలో తాను వస్తానని కూడా బాధితులకు చెప్పారు. ఆ ప్రకారమే ఆయన మంగళవారం నాడు పాపిరెడ్డిపల్లి రానున్నారు.

హెలీప్యాడ్ స్థలం మార్పు

ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బెంగుళూరు నుంచి చెన్నేకొత్తపల్లికి హెలికాప్టర్‌లో వచ్చి.. అక్కడి నుంచి పాపిరెడ్డిపల్లికి రోడ్డు మార్గంలో వెళ్లాల్సి ఉంది. చెన్నేకొత్తపల్లిలో హెలీప్యాడ్‌కు పోలీసులు అనుమతించలేదు. కుంటిమద్ది, పాపిరెడ్డి గ్రామాల మధ్య ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో అక్కడికి మారుస్తున్నారు. ఆ గ్రామాల మధ్యలో దిగి పాపిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. ఉదయం 11.05 నుంచి మధ్యాహ్నం 12.05 గంటల వరకు పాపిరెడ్డిపల్లిలో ఉండి తిరుగు ప్రయాణం కానున్నారు.

టెన్షన్...టెన్షన్

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో తొలిపర్యటన టెన్షన్ వాతావరణం నడుమ సాగనుంది. ఎంపిపి ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి రాప్తాడులో అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ఉద్రిక్తత పరిస్థితులే కొనసాగుతూ వచ్చాయి. ఇదే సమయంలో పాపిరెడ్డిపల్లిలో హత్య జరగడంతో ఇది తీవ్ర స్థాయికి చేరింది. అప్పటి నుంచి రెండు పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదే సమయంలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా విచ్చేస్తుండటంతో ఇది మరింత తీవ్ర స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. పాపిరెడ్డిపల్లి అందరూ రావద్దని ముఖ్య నేతల వరకే అనుమతి ఉంటుందని చెబుతున్నారు. వైసిపి నేతలు మాత్రం పెద్దఎత్తున తరలిరావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీంతో ఏమి జరుగుతుందోనన్న ఉత్కంఠత నెలకొంది.

పాపిరెడ్డిపల్లిలో పోలీసుల బందోబస్తు

పాపిరెడ్డిపల్లిలో పోలీసు పికెట్

ధర్మవరం రూరల్ : రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి మంగళవారం నాడు పర్యటించనున్నారు. జగన్ పర్యటన నేపథ్యంలో సందర్భంగా పోలీసులు అప్రమత్తం అయ్యారు. రెండు పార్టీల మధ్య ఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరింపజేసి పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. గత వారంలో ఉగాది పండుగ సందర్భంగా పాపిరెడ్డిపల్లిలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో వైసిపి మద్దతుదారుడు లింగమయ్య మతి చెందాడు. ఈయన మృతి అనంతరం ఇది రాజకీయ ఘటనగా మారింది. టిడిపి, వైసిపి నాయకులు ఈ ఘటనపై పరస్పరం విమర్శలు చేసుకున్నారు. ఈ ఈ నేపథ్యంలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు 8వ తేదీ వస్తున్న వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. జగన్మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో పోలీసులు గ్రామంలో బందోబస్తును కట్టుదిట్టం చేసి, పోలీసు ఆంక్షలను విధించారు. పాపిరెడ్డి గ్రామంలో శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న స్వయంగా పరిశీలించి భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇదే నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామం, ఇరుకు రోడ్లు ఉన్న నేపథ్యంలో ఎక్కువ మంది గ్రామానికి రావడానికి వీల్లేదంటూ ఇప్పటికే పోలీసులు ప్రకటన విడుదల చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

కేంద్రంలోని బిజెపి మరోమారు ప్రజలపై గుది'బండ' మోపింది. గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ.50 పెంచి పేద, సామాన్య జనం నడివిరిచింది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతం అవుతున్న సామాన్యులకు గ్యాస్ సిలిండర్ ధర పెంపు మరింత భారంగా మారింది. పెరిగిన సిలిండర్ ధరలు సామాన్యుడి జీవనంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏకంగా సిలిండర్‌పై రూ.50 పెంచడంపై ప్రజల నుంచి సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

గ్యాస్ బండ..!

◆సిలిండర్‌పై ఏకంగా రూ.50 పెంపు
◆చితికిపోతున్న సామాన్యుని జీవనం
◆కేంద్రం తీరుపై సర్వత్రా విమర్శలు



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గృహ వినియోగదారులు, ఉజ్వల సిలిండర్‌పై రూ.50 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సోమవారం అర్ధరాత్రి నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయని పేర్కొంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై గ్యాస్ ధర పెంపుతో మరింత భారం మోపినట్టయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చూస్తే అనంతపురం జిల్లాలో 5,57,975, శ్రీసత్యసాయి జిల్లాలో 6,67,268 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ప్రస్తుతం వీరందరిపై పెంచిన గ్యాస్ సిలిండర్ల భారం పడనుంది. ఇందులో సగటున నెలకు ఐదు లక్షల వరకు గ్యాస్ సిలిండర్ల వాడకం ఉండగా, సగటున పెంచిన భారం ప్రకారం రూ.2.50 కోట్ల వరకు అదనపు భారం ప్రజలపై పడనుంది.

ధర పెంపు సరికాదు..

ఇప్పటికే అన్ని రకాల నిత్యావసర ధరలు పెరిగాయి. వీటికితోడు వంట గ్యాస్ సిలిండర్‌ను పెంచితే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతారు. ఓ వైపు ఉచితంగా సిలిండర్ల అంటూ మరో వైపు ఇలా ధరలు పెంచుతూ పోతే సామాన్యులకు వనగూరే ప్రయోజనం ఏమీ లేదు. ధరలను తగ్గించాల్సిన ప్రభుత్వం ఇలా పెంచడం సరికాదు. భారాలను ప్రభుత్వం మోపుతూపోతే సామాన్య కుటుంబాలు మరింత దెబ్బతింటాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిలిండర్ ధరల పెంపుపై పునరాలోచించి, దానిని తగ్గించాలి.

అరుణ, గృహిణి, అనంతపురం.

కార్పొరేట్‌ల కోసమే గ్యాస్ ధరల పెంపు : వి.రాంభూపాల్

కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. గ్యాస్ ధరల పెంపు వ్యతిరేకిస్తూ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్ యుద్ధ సమయంలో రష్యా నుంచి చౌకగా ముడి చమురు వస్తే పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించకుండా అంబానీ రూ.లక్షల కోట్లు దోచుకోవడానికి కేంద్రం కారణమైందన్నారు. ఒకవైపు మత భావాలను రెచ్చగొట్టడం మరోవైపు ప్రజలపై భారాలు వేయడం బిజెపి విధానమని విమర్శించారు. గృహ సిలిండర్లు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.50లు పెంచడం దారుణంగా ఉందన్నారు. ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యావసరాలైన గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమే అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినిని అభినందిస్తున్న జెఎన్‌టియు విసి

జెఎన్‌టియు విద్యార్థికి ఉత్తమ క్యాడెట్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల విద్యను అభ్యసిస్తున్న కొప్పోలు రోజిత నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సిసి) ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు విద్యార్థినికి జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శ నరావు సమక్షంలో కల్నల్ ఎల్‌డి.రౌడ్రేజ్ ఎన్‌సిసిలో ప్రతిష్టాత్మకమైన ఉత్తమ క్యాడెట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా కల్నల్ ఎల్‌డి.రౌడ్రేజ్ మాట్లాడుతూ కొప్పోలు రోజిత నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్ సి సి) అసాధారణ నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించినదని తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఎఎన్‌ఒ క్యాంప్ ఆఫీసర్ డా॥శారద, సిబ్బంది అనిల్ కుమార్ పాల్గొన్నారు.

15 వరకే కందుల కొనుగోలు

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే రైతులు పండించిన కందులను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని ఎపి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పిఎం.పిన్నేశ్వరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కంది పండించిన రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధర రూ.7550తో కందులు కొనుగోలు ప్రక్రియ జరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 7900 మంది రైతుల నుంచి కందులు కొనుగోలు చేశామన్నారు. 15వ తేదీలోపు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'గేట్స్'లో పాలిసెట్ కోచింగ్

ప్రజాశక్తి-గుత్తి

పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల యాజమాన్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు 83339 87201 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గుత్తి పట్టణం నుంచి కళాశాల వరకూ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.13 కోట్లు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రధాన జిల్లా రహదారుల అభివద్ధికి నాబార్డు నిధుల కింద రూ.13 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. జిల్లాలోని ప్రధాన రహదారుల అభివద్ధిలో భాగంగా మూడు రహదారుల అభివద్ధికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఉరవకొండ మార్కెట్ యార్డ్ నుంచి కనేకల్ రోడ్డు వయా వెలగొండ రోడ్డు, ఉరవకొండ టౌన్ లిమిట్స్ వరకు 3 కిలోమీటర్ల రహదారికి 4 కోట్ల రూపాయల నిధుల మంజూరయ్యాయని తెలిపారు. ప్రధాన జిల్లా రహదారి ఉరవకొండ నియోజకవర్గంలోని గుండ్లపల్లి క్రాస్ నుంచి గోళ్ల వయా బెలుగుప్ప, వెంకటాద్రిపల్లి రోడ్డు 0/0 నుంచి 26/0 వరకు 20.30 కిలోమీటర్ల రహదారికి 6 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ప్రధాన జిల్లా రహదారి అయిన ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని విడపనకల్ నుండి గడేకల్ వరకు కిమీ 0/0 నుండి 8/8 వరకు 8.40 కిలోమీటర్ల రహదారి మెరుగుదలకు 3 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు.

'సూపర్ స్పెషాల్టీ'కి నిధులు కేటాయించాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు వైద్యులు, సిబ్బందిని నియమించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సేవలు, సమస్యలు, నిధుల కొరత అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టి ప్రజలు, రోగులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ఆరోగ్య రక్షణ శాఖలకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 5 శాతం కేటాయించాలన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్యం అందించే ప్రధాన బాధ్యతను ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రసూన, డాక్టర్ వీరభద్రయ్య, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం నాయకులు ఎంఎన్‌టి.రాజు, జెవివి నాయకులు రామిరెడ్డి, తిరుపాల్, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సురేంద్ర పాల్గొన్నారు.

సంతకాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

కబ్జాదారులను వదిలి పెట్టొద్దు : సిపిఎం

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిని వదిలిపెట్టకుండా వారిని భూ ఆక్రమణల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు టి.రామాంజినేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటుకలపల్లి భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, ఆర్‌డిఒ కేశవనాయుడు, అనంతపురం రూరల్ తహశీల్దార్ మోహన్ కుమార్‌ను కలిసి సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటుకలపల్లి గ్రామం సర్వే నెంబర్ 248/1సి1, 248/1సి2 ప్రభుత్వ భూమి దాదాపు 9.47 ఎకరాలు కబ్జా చేశారని తెలిపారు. ఈ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నెల 24వ తేదీ ప్రభుత్వ భూమిని కాపాడాలని రెవెన్యూ అధికారులు కోరగా కేవలం 0.78 సెంట్లకు మాత్రమే తహశీల్దార్ నోటీసులు పంపారని, మిగిలిన భూమి కబ్జాలో ఉందని వాటికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. 9.47 ఎకరాల భూమిలో ఎంతమంది ఉన్నారో, వారందరి పత్రాలను సమగ్రంగా పరిశీలన చేయాలన్నారు. భూ అక్రమణదారులపై కేసులు నమోదు చేసి జైలు పంపించాలని కోరారు. ఇందుకు సహకరించిన రెవెన్యూ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు వీలుగా అక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్షురాలు శ్యామల డిమాండ్ చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకుని ఐద్వా ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్లలో అందుతున్న వైద్య సేవలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారి దృష్టికి వచ్చిన సమస్యలను మీడియా ద్వారా ప్రభుత్వానికి తెలియజేశారు. అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నా పూర్తి స్థాయిలో వైద్య సేవలు ప్రజలకు అందని పరిస్థితి నెలకొందన్నారు. గైనకాలజిస్ట్, చిన్నపిల్లల వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రసవానికి సంబంధించిన సౌకర్యాలు బెడ్లు, ప్రత్యేక గది వంటివి ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ యంత్రాలను అర్బన్ సెంటర్లలోనే అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కోశాధికారి చంద్రిక, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, నాయకులు అశ్విని పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

నిత్యావసరాలను అందజేస్తున్న పెన్షనర్స్ సంఘం నాయకులు

నిత్యావసరాలు అందజేత

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు కె.ఆదిలక్ష్మి సహకారంతో కాటగాని కాలువలోని ఆశ్రయ అనాధ ఆశ్రమానికి నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, గౌరవ సలహాదారు గోవిందరాజులు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఈ సేవా కార్యక్రమం నిర్వాహకులు డి.ప్రభాకర్, ఈసి మెంబర్ కె.ఆదిలక్ష్మిలు పాల్గొని వీటిని ఆశ్రమం నిర్వాహకులకు అందించారు. సంఘం సభ్యురాలు కె. ఆదిలక్ష్మి ఆమె తల్లి కుంటుమల బాలమ్మ జ్ఞాపకార్థం రూ.4 వేల నిత్యావసర సరుకులు, కూరగాయలు ఆశ్రమ నిర్వాహకులు కృష్ణారెడ్డి, దేవి దంపతులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా నాయకులు కృష్టప్ప, వేణుగోపాల్, సభ్యులు సావిత్రి దేవి, అనంతయ్య పాల్గొన్నారు.

పన్నులు చెల్లిస్తే 5శాతం రాయితీ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియా తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి, ఖాళీ స్థలం పన్నులు ఏక మొత్తంలో చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుందన్నారు. పట్టణ ప్రజలు పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

544-డి నిర్వాసితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు, నిర్వాసితులు

తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి, బుగ్గ గ్రామాలలో 544-డి రోడ్డు భూసేకరణ పరిహారం చెల్లింపు విషయంలో నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు జి.రాజారాం రెడ్డి, బిహెచ్.రాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి మండలం, యర్రగుంటపల్లి, బుగ్గ గ్రామాలలో నివశిస్తున్న ఇల్లులు 544-డి రోడ్డు విస్తరణలో పోతుందని 2018లో అధికారులు సర్వే చేశారని తెలిపారు. ఇందుకు సంబంధించి 27-03-2025న నిర్వాసితులకు అసంబద్ధంగా పరిహారం చెల్లించారన్నారు. 2018 మార్కెట్ విలువ, అంచనా ప్రకారం చెల్లించి, 2023 గ్రామ సభల్లో ప్రకటించిన పరిహారం కాకుండా తక్కువ పరిహారం ఇచ్చి అన్యాయం చేశారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి నిర్వాసితులకు పూర్తి స్థాయి పరిహారం ఇచ్చేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంటపల్లి మాజీ సర్పంచి యుగంధర్, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

నేడు విడపనకల్లులో గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈ నెల 8వ తేదీ విడపనకల్లులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఇందులో మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొంటారని తెలిపారు. విడపనకల్లు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు.

సామాన్యులకు అందుబాటులో 'ఆల్కలైన్' వాటర్

ప్రజాశక్తి-అనంతపురం

సెలబ్రిటీలు తాగే నీటిని సామాన్యులకు తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకొచ్చారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని హోటల్ మాసినేని గ్రాండ్‌లో సోమవారం బాలాజీ ఎంటర్ ప్రైజెస్ అధినేత వేణుగోపాల్ ప్యూర్ జల్ ఆల్కలైన్ వాటర్, వాటర్ సొల్యూషన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్యూర్ జల్ కంపెనీ ప్యూరిఫైయర్స్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎక్కువగా సినీనటులు, రాజకీయ నాయకులు, క్రికెటర్లు, ప్రముఖులు మాత్రమే ఆల్కలైన్ వాటర్ తాగే వారని, ఈ నీరు మార్కెట్‌లో అధిక ధర ఉండేదన్నారు. కానీ ఆ నీటిని నగరంలో కేవలం రూ. 20 కు మాత్రమే విక్రయించేలా ప్యూర్ జల్ కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ నీటిని ప్రభుత్వ కార్యక్రమాల్లో వినియోగించేలా ప్రమోట్ చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత వేణుగోపాల్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్యూర్ జల్ సీఈవో ఖాజా హుస్సేన్, జిజిహెచ్ సర్జన్ రామస్వామినాయక్, పావని హాస్పిటల్స్ అధినేత రవీంద్ర, సిపిఐ రాష్ట్ర నాయకుడు జగదీష్, వికె.రంగారెడ్డి, కోనంకి గంగారామ్, రాయల్ మురళి, సుధాకర్ యాదవ్, కూచి హరి, కడియాల కొండన్న, గోళ్ల సుధాకర్‌నాయుడు, వడ్డే వెంకటేష్, బండి కాశీ విశ్వనాథ్, ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్కలైన్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, వైద్యులు

ప్రజాశక్తి
www.prajasakti.com

వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి

ఎమ్మెల్యేకు ముస్లిముల వినతి

ప్రజాశక్తి-తాడిపత్రి

వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లులో ఏవైనా లోటుపాట్లు ఉంటే తప్పకుండా వాటిని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని జెసి.అస్మిత్‌రెడ్డి ముస్లిం నాయకులకు హామీ ఇచ్చారు. పట్టణ మైనారిటీ పెద్దలు, ముస్లిం యువత సోమవారం ఎమ్మెల్యేని ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. వారి ఆహ్వానం మేరకు వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అశోక్ పిల్లర్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్దకు ర్యాలీగా వెళ్లి వారి నుంచి అర్జీ స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లులో ఏవైనా లోటుపాట్లు ఉంటే తప్పకుండా వాటిని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి ఉందన్నారు. తాడిపత్రిలోని ముస్లిం సమాజం 40 ఏళ్లుగా తమ కుటుంబానికి అండగా ఉందని, వారికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని ఆయన తెలిపారు.

నేటి నుంచి చెన్నమ్మ జాతర

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని రావులుడికి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ చెన్నమ్మ తిరుణాల ఉత్సవం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంగమ్మ పెట్టె మెరివణి, కథ చెప్పుడం, మంగళవారం చెన్నమ్మ సుడిబండిని ఎద్దులచే లాగిస్తారు. 9వ తేదీ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఎద్దులచే సుడిబండిని లాగిస్తారు. 10వ తేదీ భీమునిపల్లి గ్రామస్థులు పన్నెరపు బండ్లతో అమ్మవారికి పూజలు చేసి సుడిబండిని లాగిస్తారు. 11వ తేదీ తిరుణాల ఉత్సవం అనంతరం ఆలయం ముందు పొంగుపాల కార్యక్రమం నిర్వహిస్తారు.

ప్రభుత్వాసుపత్రి సందర్శన

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను సోమవారం ప్రజా సంఘాల(సిపిఎం) నాయకులు సందర్శిం చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని వారు వైద్యులు, నర్సులు, సిబ్బందిని కలిశారు. వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్ప మాట్లాడుతూ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రోగులు ప్రభుత్వ ఆసుపత్రి లోనే చికిత్స తీసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు ఎన్.రేణుక, రేవతి, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

'ఇండోర్ స్టేడియంలో నిధులు దుర్వినియోగం'

ప్రజాశక్తి-నార్పల

స్థానిక ఇండోర్ స్టేడియంలో నిధుల దుర్వినియోగంపై సోమవారం ఉన్నతాధికారులు పోలీసుల కు ఫిర్యాదు చేశారు. నార్పల క్రీడా వికాస్ కేంద్రంలో పనిచేస్తున్న జూడో కోచ్ రమేష్ నిధులు దుర్వి నియోగం చేయడంతో పాటు 6 నెలలుగా విధులకు హాజరుకావడంలేదు. సుమారు రూ. 6 లక్షలు దుర్వినియోగమైనట్లు విశ్వసనీయ సమాచా రం. గతంలో పనిచేసిన డిఎస్‌డిఒ సహకారంతోనే కోచ్ రమేష్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె, క్రీడాకారులు చెల్లించే నగదును శాప్‌కి చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం బయట కు రావడంతో నార్పలలో ఇండోర్ స్టేడియం ఏర్పాటై నప్పటి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా ఎంత అద్దె వసూలైంది, ఎంత డిపాజిట్ చేశారు, క్రీడాకారులకు, స్టేడియం నిర్వహణకు ఎంత ఖర్చు చేశారో మొత్తం వివరాలు నిగ్గు తేల్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఇండోర్ స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్ వేలం నిర్వహించి దాదాపు దశాబ్ద కాలం దాటింది. అప్పటినుంచి స్థానిక, జిల్లా అధికారుల సహకారంతో వాటికి వేలం నిర్వహించకుండా కొనసాగిస్తున్నారు. నిర్వాహకుల పర్యవేక్షణ కొరవడ డం, నిర్లక్ష్యం కార ణంగా పెవిలియన్ భవనం ఆకతా యిలకు అడ్డాగా మారింది. ఇకనైనా జిల్లా అధికారులు లోతుగా విచా రణ జరిపి అవినీతికి పాల్పడిన వారిని, వారికి సహక రించిన వారిని కఠినంగా శిక్షించి, మరమ్మతులు చేసి క్రీడాకారులకు అనుకూ లంగా ఇండోర్ స్టేడియంను తీర్చిదిద్దాలని క్రీడాకారులు కోరుతున్నారు.

అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

ప్రజాశక్తి-శింగనమల


తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన అకాల వర్షం వల్ల దెబ్బతిన్న పంట లకు ప్రభుత్వం ఎకరాకు రూ. లక్ష నష్టపరి హారం ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ అకాల వర్షాలతో మండలంలో వరి, మామిడి, దానిమ్మ, అల్లనేరేడు, బొప్పాయి, మొక్కజొన్న, తదితర పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. దీంతో రైతులు లక్షలాది రూపాయలు నష్టపోయార న్నారు. పంట నమోదులో భాగంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు డబ్బులు చెల్లించారని వెంటనే వారు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాల న్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కొండారెడ్డి, అధ్యక్షులు శ్రీనివాసులు, మండల నాయకులు సుంకన్న, ఆవుల రామాంజనేయులు, బాలరాజు, రుషింగప్ప, రమేష్, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపివి శవ రాజకీయాలు

టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

శవ రాజకీయాలు చేస్తే ప్రజలు నమ్మరని టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు వైసిపి శ్రేణులకు ఓ ప్రకటనలో హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ రాజకీయ లబ్ధి కోసం సొంత పార్టీ వారినే హత్య చేయించి, ఆ కుట్రలు టిడిపిపై నెడుతున్నారని మండిపడ్డారు. ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తి గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి చనిపోతే, వారి కుటుంబ సభ్యులను ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. కురుబ లింగమయ్య హత్య వెనుక తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హస్తముందని ఆరోపించారు. తోపుదుర్తి సోదరుల అవినీతి, అక్రమాలు, ఫ్యాక్షన్ రాజకీయాల గురించి రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. అలాంటి వ్యక్తి ఇచ్చిన తప్పుడు సమాచారాన్ని నమ్మి వైసిపి అధినేత జగన్ శవరాజకీయాలు చేసేందుకు పాపిరెడ్డిపల్లికి వస్తుండడం సిగ్గు చేటన్నారు. నిజంగా జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వైసిపి పాలనలో హత్యకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించాలని సూచించారు. సొంత తల్లి, చెల్లి, కుటుంబ సభ్యులను మోసం చేసిన జగన్ రాజకీయాల్లో కొనసాగడానికి అనర్హుడన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్ ఇకనైనా పరిటాల కుటుంబంపై అసత్య ఆరోపణలు మాని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు సహకరించాలని సూచించారు.

అంకితభావంతో పని చేయాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ ఈబి.దేవి

వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది అంకిత భావంతో పని చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని డిఎంహెచ్‌ఒ జెండా ఊపి ప్రారం భించారు. ర్యాలీ నగరంలోని వైద్య శాఖ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ చేపట్టి అక్కడి నుంచి తిరిగి వైద్య శాఖ కార్యాలయం ముందు కూడలికి చేరుకుని అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. డిఎంహెచ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన ప్రారంభం–ఆశాజనక భవిష్యత్తు' నినాదంతో మాతా, శిశు ఆరోగ్యం, క్యాన్సర్, టిబి, కుష్టు, చక్కెర, బిపి, వ్యాధులతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ, నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డా. నారాయణస్వామి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డెమో త్యాగరాజ్, ఆరోగ్య విద్యాధికారి గంగాధర్, వైద్య, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థినులు, సచివాలయ ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి : మండలంలోని రాయలచెరువు పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ దేవరాజ్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ల్యాబ్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది నారాయణస్వామి, లక్ష్మన్న, సుమతీ దేవి, షబ్బీర్ అహ్మద్, సబిత, సాయిలత, ఉమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, బొమ్మనహాల్ పిహెచ్‌సి సిబ్బంది ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కుమార్ రాజా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మంచి ఆహార అలవాట్లు పాటించడంతో పాటు రోజూ వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ర్యాలీలో వైద్యులు, సిబ్బంది, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి : మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎపి ఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ నాగేంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పులిగుట్ట విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

డ్రైయినేజీ మరమ్మతుల కోసం వినతి

రాయదుర్గం: పట్టణంలోని దాసప్ప రోడ్డులో చేపల మార్కెట్ వద్ద ధ్వంసమైన డ్రెయినేజీ కాలువ మరమ్మతులు చేపట్టాలని కోరుతూ టిడిపి నాయకులు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. టిడిపి నాయకులు మహబూబ్‌బాషా, వెంకటేశులు, టంకశాల హనుమంతు, పొరాలు పురుషోత్తం సోమవారం చేపల మార్కెట్ వద్ద ధ్వసంమైన డ్రెయినేజీ కాలువను పరిశీలించారు. వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే మార్గంలో డ్రెయినేజీ కాలువపై ఉన్న స్లాబ్ ధ్వంసం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

నార్పల : మండలంలో వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేశారు. సిపిఐ మండల కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినా, కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల వర్షాలకు పంటలు దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమం లో సుధాకర్, వ్యకాసం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య, నారాయణప్ప, అల్తాఫ్, సూరి, చంద్ర, శివశంకర్, నారాయణ, శీన, తిమ్మిరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మి కులు సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 6 నెలల వేతనాలు, 30 నెలల పిఎఫ్ చెల్లించకుండా కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రన్నారు. ప్రధానంగా కార్మికులకు వేతనాలు అందా లంటే సమ్మె చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆందోళనలు చేపడితే ఒకటి లేదా రెండు నెలల వేతనాలు ఇస్తారని, ఆ తర్వాత షరా మామూలే అన్నారు. కార్మికులు సమ్మె చేపడితే కాంట్రాక్టర్ తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం సరైంది కాదన్నారు. ఇంకోసారి కార్మికుల ను బెదిరించాలని చూస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. అనంతరం ఆర్‌డిఒ వసంతబాబుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సిఐటియు మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి యూనియన్ జిల్లా ట్రెజరర్ వన్నూరు స్వామి, నాయకులు రామదాసు, హనుమంతరెడ్డి, కార్మికులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు భవిత్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో విక్రమ్‌రాజ్ పురోహిత్

ప్రజాశక్తి-అనంతపురం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న విక్రమ్‌రాజ్ పురోహిత్

నగరంలోని రఘువీరా టవర్స్‌లో ఉన్న చిత్రలేఖ టెక్స్‌టైల్స్, శోభ స్క్వేర్ షోరూమ్ అధినేత విక్రమ్ రాజ్ పురోహిత్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 2006లో షాపు ప్రారంభించి నప్పటి నుంచి తన వంతుగా సమాజానికి ఉపయోగపడాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలతో ముందుకెళు తున్నారు. మరోవైపు టిడిపిలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. తన పుట్టిన రోజున విలాసవంతమైన కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సర్వజన ఆస్పత్రిలో అన్నదానం, రక్తదా నం, తదితర సేవా కార్యక్రమాలు చేపడుతూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వేసవి, శ్రీరామనవమి సందర్భంగా రఘువీరా టవర్స్ వద్ద మిత్రులు మంజుతో కలిసి మజ్జిగ, నీటి పంపిణీ చేశారు. వ్యాపార రంగంలోనూ ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు అందిస్తున్నారు. నగరంలోని 14, 15 డివిజన్లలో ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ కాలంగా అనంతపురం ప్రజలకు సేవలందిస్తూ చిత్రలేఖ ద్వారా ఆదరణ పొందామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల ద్వారా సామాజిక బాధ్యత ముందుకు వెళ్తామన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-పుట్లూరు

తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో ఇప్పటికే చాలా బోరు బావులు ఎండిపోయి తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. రాబోయే రోజుల్లో బోరు బావులు పూర్తిగా ఎండిపోయే అవకాశం ఉందన్నారు. వర్షా లు సకాలంలో కురుస్తాయో లేదో తెలియని అయో మయంలో ఉన్నందున పుట్లూరు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. మండలంలో కరువు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించా లని కోరుతూ తహశీల్దార్ శేషారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, ఆదినారా యణ, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, ఓబులేసు, రైతులు నాగేశ్వరరెడ్డి, జి.శివారెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, శేషయ్య, శ్రీరామిరెడ్డి, మల్లికార్జున, నాగేశ్వరరావు, రామంజి, సుబ్బు, విశ్వనాథ్, రాఘవ, మల్లి పాల్గొన్నారు.

త్రిభువన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపి అంబికా

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నూతనంగా నిర్మించిన త్రిభువన్ మల్టీ స్పెషాలిటీ హాస్పి టల్‌ను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపి అంబికా లక్ష్మీ నారాయణ, టిడిపి యువ నాయకుడు డాక్టర్ ఉమర్ ముక్తార్ ప్రారంభిం చారు. ఎంపి మాట్లాడుతూ ప్రజలకు అత్యాధునిక, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సోమసుందర్‌నాయక్, మెడికల్ డైరెక్టర్ డా.వికాస్ నరసింహా మాట్లా డుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ఆసుపత్రిని ప్రారంభించామని తెలిపారు. హాస్పిటల్‌లో మల్టీ స్పెషాలిటీ సేవలు, అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో డాక్టర్ ఆనంద్, మాజీ జడ్పిటిసి వేణుగో పాల్, దగ్గుపాటి రాజా, విద్యావేత్త రాజేంద్రప్రసాద్, పలువురు వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని టిడిపి అర్బన్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ 18 మంది లబ్ధిదారులకు రూ. 20 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికే సిఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ. కోటి సాయం చేశామన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైసిపి హయాంలో ఒక ఇల్లు కూడా కట్టకుండా బిల్లులు చేసుకున్నారని విమర్శించారున. ప్రస్తుతం 10వేలకు పైగా పేదలకు ఇళ్లు మంజూరే చేయనున్నట్లు తెలిపారు. టిడ్కో గృహాలను త్వరలోనే పూర్తి చేసే లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో రాయల్ మధు, ఈటే స్వామిదాస్, కూచి హరి, సయ్యద్ సైపుద్దీన్, నాయకులు, పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No:396/2023

Between:

1. పి.నాగమ నాయుడు S/o పి.పెద్ద బాలయ్య, D.No:1-30,అరకటవేముల గ్రామము, పుట్లూరు మండలం, అనంతపురం జిల్లా.
2. పి.వైష్ణవి D/o పి.నాగమ నాయుడు, మైనరు
3. పి.సౌమ్య D/o పి.నాగమ నాయుడు, మైనరు, P2 మరియు P3 మైనర్లు అయినందున తండ్రి పి.నాగమనాయుడు (గార్డియన్) S/o పి.పెద్ద బాలయ్య, D.No:1-30, అరకటవేముల గ్రామము, పుట్లూరు మండలం, అనంతపురం జిల్లా. ...వాదులు

ఎదిరి

బి.చంద్రకళ మరియు ఇద్దరు

D3:భాయినేని కల్పన W/o బి.నరసింహుదు, గృహిణి, D.No:2-89-2, ఓబులాపురం గ్రామం, దోసలేరు హమ్‌కెట్, పుట్లూరు మండలం, అనంతపురం జిల్లా. ...ప్రతివాదులు

మూడవ ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలో వాదులు, ప్రతివాదులైన మీ మీద భాగ పరిష్కారము కోసము, మరియు ప్రతివాదులైన 1,2 మరియు బి.నరసింహులు మధ్య వ్రాసుకున్న భాగ పరిష్కార పత్రమును రద్దు చేయమనిక కోరుతు దావా దాఖలు చేసి యున్నారు. పై దావా నీ హాజరు నిమిత్తము 17-04-2025న వాయిదా వేసి యున్నారు. పై విషయములో నీకు అభ్యంతరములున్న యెడల పై తేదిన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల నీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

C.రమేష్‌నాథరెడ్డి,
K.శంకరరెడ్డి,
D.S.రామక్రిష్ణ
వాదితరుపు న్యాయవాదులు, తాడిపత్రి.

ఫార్మర్ ఐడి ప్రక్రియను వేగవంతం చేద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఏవో శుభకర్ సూచించారు. పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం ఏవో సిబ్బందితో సమీక్ష నిర్వహిం చారు. మండల వ్యాప్తంగా 11,519 మందికి 5,240 మంది రైతులు మాత్రమే విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన మీ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి నమోదు చేసుకోవాలన్నారు. అలాగే చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం రాయితీపై ట్రాక్టర్ పరికరాలు మంజూరు చేస్తామని, అవసరమైన రైతులు సొంత ట్రాక్టర్ కలిగి ఉండి ఆర్‌సి, సంబంధిత పత్రాలతో స్థానిక వ్యవసాయ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కె సిబ్బంది లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రైతుల పండించిన బ్యాడిగి, రెడ్ మిర్చికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక అధ్యక్షులు, బిసివై పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బొమ్మనహాల్ మండలంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మిర్చి పంట సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర లేక లబోదిబోమంటున్నారన్నారు. కావున ప్రభుత్వమే రైతుల నుంచి క్వింటాల్ రూ. 11,600 చొప్పు కొనుగోలు చేయాలని కోరారు. అలాగే కరువు ప్రాంతమైన నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి రైతులకు అండగా నిలవాలని కోరారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-ఉరవకొండ

మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు సోమవారం వార్డు మెంబర్ నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలో సీసీ రోడ్డు, కల్వర్టు పనులకు భూమి పూజ చేశారు. దీంతో పట్టణ ప్రజలు మంత్రి కేశవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యకమంలో టిడిపి నాయకులు వేల్పుల శ్రీనివాసులు, వార్డు మెంబర్ వాసు దేవుడు, రాజేష్, ప్రసాద్, శంకర్, ముకుంద, జగన్నాథ్, గోపాల్, కట్టుబడి ఖలందర్, హోతూరు బాషా, మెకానిక్ రెహమాన్, మద్దికెర అన్వర్, పామిడి సలీం, కాంట్రాక్టర్ బాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న టిడిపి నాయకులు

విగ్రహానికి ఏర్పాటు చేసిన పైకప్పు

విగ్రహానికి పైకప్పు ఏర్పాటు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని రాణి సత్రం ప్రయివేటు బస్టాండు ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి రాయదుర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షుడు మలకన్న పైకప్పును ఏర్పాటు చేయించారు. చాలా రోజులుగా ఈ విగ్రహం ఎండ ఎండుతూ, వానకు తడుస్తూ ఉండేది. దీంతో స్పందించిన మలకన్న ఇనుప రేకులతో పైకప్పు ఏర్పాటు చేయించడంతో దేవిరెడ్డిపల్లి రాజేష్, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ గోపురం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

ఆలయ ఘటనపై విచారణకు విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ ఇన్‌ఛార్జి చిందనూరు నాగరాజు కోరారు. ఈ మేరకు సోమ వారం అనంతపురం ఆయన దేవాదాయ శాఖ అసి స్టెంట్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. గత నెలలో ఆలయంలో మూలవిరాట్ విగ్రహాలను పక్కకు తొలగించి తిరిగి ప్రతిష్ఠించిన విషయాన్ని అధికారికి వివరించారు. స్పందించిన ఎసి ఆ ఘటనపై వివరణ ఇవ్వాలని సమూహ ఆలయాల ఈవో నరసింహారెడ్డిని ఆదేశించినట్లు తెలిపారు.

అన్నదాన కార్యక్రమం

ప్రజాశక్తి-పుట్లూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం ఈ ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టారు. కార్యక్రమం లో దాతలు ఆర్.ఓబులేసు, ఎంవి.సుబ్బయ్య, మంగపట్నం నారాయణమ్మ, చిన్న నాగన్న, కుందూ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వాహనాలకు నెంబర్, ఆర్‌సి, లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-శింగనమల

వాహనాలకు నెంబర్ ప్లేట్లు, ఆర్‌సి, డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారున. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎలాంటి వాహనానికైనా నెంబర్ ప్లేట్లు, ఆర్‌సి తప్పనిసరిగా ఉండాన్నారను. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించరాదన్నారు. యూనిఫామ్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అతిక్రమిస్తే వాహనం సీజ్ చేసి, వాహనదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్ఐ సూచించారు.

శ్రీకోదండరాముని సేవలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని లక్ష్మీనగర్‌లో వెలసిన శ్రీకోదండరామస్వామి ఆలయం లో సోమవారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా శ్రీసీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు. ప్రజలపై శ్రీకోదండరాముని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల నరసింహులు, కొండన్న, నాయకులు కోనంకి గంగారామ్, కూచి హరి, చేపల హరి, కార్పొరేటర్ జనబలం బాబా, ఓంకార్ రెడ్డి, కృష్ణం రఘు, ఆలయ కమిటీ సభ్యులు బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-తాడిపత్రి

మండలంలోని ఆవుల తిప్పాయపల్లి వద్ద ఉన్న రమణ మహర్షి ఆశ్రమం, పట్టణంలోని పప్పూరు రోడ్డులో ఉన్న సౌభాగ్య సింధు ఆశ్రమంలో సోమవారం ఇన్ఫినిటి ఫిన్ కార్ప్ సొల్యూషన్ ప్రై.లిమిటెడ్ కంపెనీ ఎండి శ్రీకాంత్ రావల్కర్ ఆదేశాలతో దాదాపు 1,03,000 విలువైన బియ్యం ప్యాకెట్లు, పరుపులు, దుస్తులు, పుస్తకాలు, పెన్నులు, చెప్పులు పంపిణీ చేసినట్లు కంపెనీ ఏరియా మేనేజర్ కృష్ణ మామిల్ల తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు కంపెనీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణ మామిల్ల మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదిగి, భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేయాలని సూచించారు. అనంతరం ఇస్కాన్ టెంపుల్ నుంచి వచ్చిన గోపిదేవిదాశి ఆధ్యాత్మిక సందే శం ఇచ్చారు. కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు భాస్కర్, ఈశ్వర్‌రెడ్డి, బాబా ఫకృద్దీన్, హాజీవలి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి సరుకులు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై సోమవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు తెల్లవారుజామున గుర్తించామన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రైతుపై దాడి..

అవమానంతో ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని మూగేతిమ్మంపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటశివ సోమవారం వ్యవసాయ పొలంలోకి వెళ్తుండగా తిమ్మారెడ్డి, రాజశేఖర్, బ్రాహ్మయ్య, కేశవయ్య దారిలో అడ్డగించి మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో వెంకటశివ అవమానంగా భావించి గడ్డి నివారణకు వాడే మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైతు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సుమారు 8 నెలల నుంచి తాము పొలానికి వెళ్లకుండా వారు అడ్డుకుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు దాదాపు 5 సార్లు కొలతలు వేసి పోలీసుల సమక్షంలో హద్దు రాళ్లు ఏర్పాటు చేయగా దౌర్జన్యంగా తొలగించారన్నారు. హద్దు రాళ్లను తొలగిం చొద్దని అడ్డు వెళ్లిన వెంకటశివను దారుణంగా కొట్టారని ఆయన భార్య వాపోయింది. ఇకనైనా అధికా రులు స్పందించి రికార్డుల ప్రకారం తమ పొలానికి దారి చూపించాలని బాధిత కుటుంబం కోరుతోంది.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No:406/2023

Between:

జి.లక్ష్మీదేవి W/o వెంకటేసు, గృహిణి, A కొండాపురం గ్రామము, పుట్లూరు మండలం, అనంతపురం జిల్లా. ...వాది

ఎదిరి

సిరిగౌని రామాంజినేయులు S/o ఆంజినేయులు, వ్యాపారం, యర్రగుంట్ల గ్రామము మరియు పోస్టు, గార్లదిన్నె మండలం, అనంతపురం జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలో వాది, ప్రతివాదులైన నీ నుండి తనకు రావలసిన ప్రోనోట్లు బాకీ రాబట్టుకొను నిమిత్తము పై కోర్టులో దావా దాఖలు చేసి యున్నది. పై దావాలో నీ హాజరు నిమిత్తము కోర్టువారు 21-04-2025న వాయిదా వేసి యున్నారు. కావున పై దావా విషయములో నీకు అభ్యంతరములున్న యెడల 21-04-2025న ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల నీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

C.రమేష్‌నాథరెడ్డి,
K.శంకరరెడ్డి,
D.S.రామక్రిష్ణ
వాదితరుపు న్యాయవాదులు, తాడిపత్రి.